
సాక్షి ఒడిశా

గురువారం । 23 । ఫిబ్రవరి । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,84,153లు, బంగారం 350 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



ఎఫ్‌బీఐ ముద్దు.. సీబీఐ కద్దు!

- 8లో



మార్చి 7న డోలోత్సవం

- 8లో

న్యూస్‌రీల్

ముగిసిన శిక్షణ శిబిరం



ప్రసంగిస్తున్న ఎస్‌డీసీ చైర్‌పర్సన్ అనసూయ మాఝి

రాయగడ: జిల్లా కేంద్రంలోని అటానమస్ కళాశాలలో గత 10రోజులుగా నిర్వహిస్తున్న ఆత్మరక్షణ విద్య శిక్షణ శిబిరం బుధవారం ముగిసింది. కళాశాల గోల్డెన్ జూబ్లీ హాలులో జరిగిన ముగింపు కార్యక్రమానికి స్పెషల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ చైర్‌పర్సన్ అనసూయ మాఝి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి యువతీ తనకు తాను రక్షించుకునేందుకు ప్రత్యేక ఆత్మరక్షణ శిక్షణ తీసుకోవాలని సూచించారు. చదువుతో పాటు క్రీడలు వంటి అంశాలు, ఆత్మరక్షణ విద్య ఎంతో అవసరమని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీకే గంతాయిత్ మాట్లాడుతూ శిక్షణ శిబిరంలో ప్లస్2, ఆర్ట్స్, కామర్స్ విభాగానికి చెందిన 300మంది విద్యార్థినులు హాజరై, శిక్షణ పొందారని తెలిపారు. అనంతరం ప్రశంసాపత్రాలు అందించి, అభినందించారు.

సర్దాపురం అభివృద్ధికి చర్యలు



కల్యాణ మండపం నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న తిరుపతి పాణిగ్రాహి

పర్లాకిమిడి: జిల్లాలోని గుసాని సమితి సర్దాపురం గ్రామంలో రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన మిషన్‌శక్తి నూతన భవనాన్ని సమితి అధ్యక్షుడు ఎస్.వీరరాజు, జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు ప్రారంభించారు. అలాగే సర్దాపురంలో కల్యాణ మండపం నిర్మాణానికి బీజేడీ సీనియర్ నాయకులు తిరుపతి పాణిగ్రాహి భూమిపూజ చేశారు. కార్యక్రమానికి ఆర్ఎంసీఎస్ అధ్యక్షుడు ఎస్.గజపతిరావు, బీజేడీ రాష్ట్ర కార్యదర్శి మారుత్ పాలో, జెడ్పీటీసీ సభ్యుడు ఎన్.బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి నిరసన సెగ



మంత్రి కాన్వాయ్ ముందు నల్లజెండాలు ప్రదర్శిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మల్కన్‌గిరి: జిల్లాలో బుధవారం పర్యటించిన రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి రోహిత్ పుజారికి నిరసన సెగ తగిలింది. మల్కన్‌గిరిలో జరిగిన కళాశాల వార్షికోత్సవానికి హాజరయ్యేందుకు వచ్చిన ఆయనను.. యువజన కాంగ్రెస్ నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. మంత్రి ప్రయాణిస్తున్న కాన్వాయ్‌కు ఎదురుగా వెళ్లి, గోబ్యాక్ అంటూ నల్ల జెండాలు ప్రదర్శించారు. దీనికి సంబంధించిన చిత్రాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. కాగా తాజా ఘటనపై అటు పోలీసులు, ఇటు అధికార బీజేడీ నాయకులు ఎటువంటి ప్రకటన వెల్లడించలేదు.

కొండల్లో మహిళ అనుమానాస్పద మృతి



పోలీసు జాగిలం సాయంతో తనిఖీలు నిర్వహిస్తున్న దృశ్యం

మల్కన్‌గిరి: జిల్లాలోని మల్కన్‌గిరి సమితి పాత్రొగూడ సమీపంలోని మల్లికేశ్వర కొండ ప్రాంతంలో అనుమానాస్పద రీతిలో మహిళ మృతదేహం లభ్యమైంది. బుధవారం ఉదయం అటువైపుగా వెళ్లిన మేకల కాపరికి సగం కాలి ఉన్న మృతదేహం తారసపడింది. దీంతో గ్రామంలోకి పరుగులు తీసిన ఆయన.. స్థానికులకు విషయం తెలియజేశాడు. అనంతరం పోలీసులకు సమాచారం అందించగా, మల్కన్‌గిరి ఐఐసీ రీగాన్ కీండో, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహం మహిళదిగా గుర్తించారు. అయితే ఆమె బలవన్మరణానికి పాల్పడిందా? లేదా ఎవరైనా హత్య చేశారో అనే విషయంపై దర్యాప్తు చేపట్టారు. ఘటన జరిగి 2రోజులై ఉంటుందని భావిస్తున్నారు. ఈ మేరకు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు.. పోస్టుమార్టం నిమిత్తం మల్కన్‌గిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

దర్యాప్తులో ఎఫ్‌బీఐ సాయం



సభలో ప్రసంగిస్తున్న సీఎం నవీన్ పట్నాయక్

- నవకిషోర్ దాస్ కేసు విచారణలో సహకారంపై రాష్ట్ర క్రైంశాఖ యోచన
- అసెంబ్లీలో ప్రకటించిన సీఎం నవీన్ పట్నాయక్
- కేంద్ర హోంశాఖ అనుమతి కోసం వేచి చూస్తున్నట్లు వెల్లడి
- విపక్షాల అభ్యంతరాలపై సవివరంగా సమాధానం



అసెంబ్లీలో మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే నర్సింగ మిశ్రా



నవకిషోర్ దాస్(ఫైల్)

భువనేశ్వర్: రాష్ట్ర ఆరోగ్య–కుటుంబ సంక్షేమశాఖ మంత్రి నవకిషోర్ దాస్ హత్య కేసు దర్యాప్తులో రాష్ట్ర క్రైంశాఖ ఎఫ్‌బీఐ(అమెరికా ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్) సహాయాన్ని కోరనున్నట్లు ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ బుధవారం అసెంబ్లీలో వెల్లడించారు. ప్రవర్తనా విశ్లేషణలో ఎఫ్‌బీఐ అత్యుత్తమ నైపుణ్యత సాధించిందని పేర్కొన్నారు. దీనిపై సహకారానికి కేంద్ర హోం శాఖ అనుమతి కోరామన్నారు. మంత్రి హత్య, తదనంతర ఘటనలు, పరిణామాలపై విపక్షాల ఆందోళనపై సీఎం నవీన్ స్పందించారు. కేసు దర్యాప్తు, పురోగతి తదితర వివరాలను సభలో సవివరంగా తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ హత్యా ఘటనలో ఏ ఒక్క కోణం దర్యాప్తు పరిధి నుంచి చేజారకుండా రాష్ట్ర, జాతీయ స్థాయిలో విశేష అనుభవం కలిగిన ఫోరెన్సిక్ నిపుణుల సాయంతో పకడ్బందీగా విచారణ కొనసాగుతోందని ప్రకటించారు. కేసు దర్యాప్తులో ప్రభుత్వం నిష్పక్షపాత వైఖరితో అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్న తరుణంలో ప్రతిపక్షాలు రేపుతున్న దుమారం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ విషాద ఘటనను రాజకీయం చేయకుండా నిందితుడి వ్యూహం, ఆంతర్యం తెరపైకి తెచ్చే దిశలో కొనసాగుతున్న దర్యాప్తు పట్ల విపక్షాలు విశ్వాసం కూడగట్టుకుని, సహనం ప్రదర్శించాలని సూచించారు.

విపక్షాలు సహకరించాలి..

హత్యోదంతంపై విపక్షాలు చేస్తున్న దురుద్దేశపూర్వక నిరాధార, అభూత కల్పనల వ్యాఖ్యలు, విమర్శలు ప్రభుత్వంతో పాటు ప్రజలను కూడా దిగ్భ్రాంతికి గురి చేసిందని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో న్యాయవ్యవస్థ స్వతంత్ర, బలమైన విభాగంగా కొనససాగుతోందని గుర్తుచేశారు. కేసు దర్యాప్తును పర్యవేక్షణకు ఒడిశా హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తిని నియమించిందన్నారు. న్యాయపరమైన పరిశీలనలో పోలీసుల దర్యాప్తు అత్యంత పారదర్శకంగా కొనసాగుతుందని తెలియజేశారు. భారత న్యాయ వ్యవస్థ పట్ల గట్టి నమ్మకం కలిగి, మంత్రి హత్య కేసు దర్యాప్తు ఘట్టం రాజకీయం చేయకుండా పటిష్టంగా కొనసాగేందుకు సహకరించాలని పిలుపునిచ్చారు. 75 ఏళ్ల స్వతంత్ర భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో రాష్ట్ర రాజకీయాలు అత్యంత పరిణతి చెంది, ఉన్నత స్థాయి రాజకీయ శైలికి గుర్తింపు సాధించాయన్నారు. తాజా పరిస్థితులు రాష్ట్ర ప్రజా ప్రతినిధుల సభ విలువలను దిగజార్చే దిశలో రంకెలు వేస్తున్నాయని అసంతృప్తి వ్యక్త పరిచారు. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకు శుభ సంకేతం కాదన్నారు. హత్య ఘటనలో నిందిత అధికారిని తక్షణమే విధుల నుంచి బహిష్కరించామని, పూర్తి న్యాయం చేకూరే దిశలో విచారణ నిరవధికంగా కొనసాగుతోందని స్పష్టంచేశారు.

నేటి ఉదయానికి వాయిదా..

మంత్రి నవకిషోర్ దాస్ హత్యపై అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల రెండో రోజు విపక్షాల వాగ్యుద్ధంతో సభ హోరెత్తింది. తొలుత ఉదయం 11.30 గంటల వరకు సభను వాయిదా వేసినట్లు స్పీకర్ ప్రకటించారు. తరువాత, అదే పరిస్థితి కొనసాగడంతో సాయంత్రం 4.30 గంటలకు సభా కార్యక్రమాలను మరోసారి వాయిదా వేశారు. సభ మధ్యలోకి బీజేపీ, కాంగ్రెస్ సభ్యులు చొచ్చుకొచ్చి నినాదాలు చేశారు. ఈ నేపథ్యంలో ఒడిశా పట్ల కేంద్రం ఉదాసీనతపై బీజేడీ సభ్యులు తమ సీట్ల వద్దే నిల్చుని నినాదాలు చేశారు. విపక్షాల ఆందోళనతో సభ ముందుకు సాగలేదు. ఎట్టకేలకు సభ నిర్వహణకు స్పీకర్ అఖిలపక్ష సమావేశానికి పిలుపునిచ్చారు. అయితే విపక్షాల గందరగోళ వైఖరి వీడక పోవడంతో సభను వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. ప్రశ్నోత్తరాల సమయం ప్రారంభం నుంచీ ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీ మధ్య హోరాహోరీ పోరు సాగింది. సభ్యులు సభ మధ్యలోకి వచ్చి నినాదాలు చేశారు. దీంతో కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో విపక్షాల డిమాండ్లపై తీర్మానం ద్వారా గురువారం సభలో చర్చ జరుగుతుందని స్పీకర్ ప్రకటించారు. అనంతరం గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై చర్చ జరిగింది. బీజేడీ ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ ముదులి ప్రసంగించారు. సభలో వాతావరణం చల్లబడక పోవడంతో సభా కార్యక్రమాలను గురువారం ఉదయం 10.30 గంటల వరకు నిరవధికంగా వాయిదా వేసినట్లు స్పీకర్ ప్రకటించారు.

ఇటువంటి స్పందన ఊహించ లేదు..



నర్సింగ మిశ్రా, కాంగ్రెస్ విపక్ష నేత

భువనేశ్వర్: మంత్రి నవకిషోర్ దాస్ హత్య ఘటనపై ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ బుధవారం సభలో వివరణ ప్రవేశపెట్టారు. హత్యానంతరం దర్యాప్తులో రాష్ట్రప్రభుత్వం చేపట్టిన చర్యలను ఆయన సభకు సవివరంగా తెలియజేశారు. సున్నితమైన ఈ ఘటనను రాజకీయం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ విపక్షాలపై ఆయన విరుచుకుపడ్డారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ శాసనసభ నేత నర్సింఘ మిశ్రా స్పందించారు. నవకిషోర్ దాస్ హత్యోదంతంపై సీఎం సభలో పెదవి కదపడం అభినందనీయమన్నారు. అయితే ఆయన తాజా సమాచారం సభలో ప్రవేశపెట్ట లేకపోయారని వ్యాఖ్యానించారు. హత్య చేసింది(ఏఎస్ఐ) తానేనా అనే కోణంలో మాత్రమే విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. ఇది ఇప్పటికే అందరికీ తెలుసని, ఇందులో కొత్త సమాచారం ఏముందని నిలదీశారు. 'కిషోర్‌దాస్ హత్య కుట్ర అని కుటుంబీకులు తెలిపారు. వారితో ఏకీభవిస్తున్నట్లు మిశ్రా ప్రకటించారు. లేనిపక్షంలో ట్రాఫిక్‌ను నియంత్రించే విధుల్లో ఉన్న సిబ్బంది.. మంత్రి సమీపానికి అంత సులభంగా ఎలా రాగలిగాడు? ఈ విషయం తెలిసినా ఐఐసీ(ఇన్‌స్పెక్టర్ ఇన్‌చార్జి) ఎందుకు ఆపలేదో తెలియకపోతే ఎలా? ఈ దిశలో క్రైం బ్రాంచ్ సరైన విచారణ చేపట్టక పోవడం విచారకరం. ముఖ్యమంత్రి వివరణలో ఈ విషయాలు వెల్లడవుతాయని ఊహించాను. ఆయన ఈ అంశాల్ని పూర్తిగా విస్మరిస్తారని అనుకోలే'దని విచారం వ్యక్తం చేశారు. విపక్షాల డిమాండ్లపై ముఖ్యమంత్రి ఏమీ మాట్లాడలేదు.

సిట్‌తో విచారణకు డిమాండ్..

కిషోర్‌దాస్ ఘటనపై అనుభవజ్ఞులైన న్యాయవాదిగా నర్సింగమిశ్రా పలు సందేహాలు వేలెత్తి చూపారు. ఘటనా స్థలంలో మృతిచెందిన మంత్రిని భువనేశ్వర్‌కు ఎందుకు తరలించారు..? మృతదేహం నుంచి తూటాను ఎందుకు బయటకు తీయలేదని ప్రశ్నించారు. ఇటువంటి ఘటనల్లో శరీరంలో దూసుకుపోయిన తూటా ఎన్నో వాస్తవాలను వెలుగులోకి తెచ్చిన దాఖలాలు ఉన్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి వైదొలగి బీజేడీలో చేరినప్పటి నుంచి పశ్చిమ ఒడిశా శిబిరంలో తీవ్ర అసంతృప్తి చోటు చేసుకుందని, ప్రధానంగా అధికార పార్టీకి చెందిన మాజీ మంత్రులతో ఆయన ఏకీభవించలేదన్నారు. ఈ వర్గం దాస్‌పై గురిపెట్టి, కుట్ర పన్నిన పరిస్థితులు అడుగడుగునా తారస పడినట్లు సంచలనాత్మక వ్యాఖ్యలు చేశారు. వీటిని పరిగణలోకి తీసుకుని, కిషోర్‌దాస్ హత్యపై ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)తో విచారణకు కాంగ్రెస్ డిమాండ్ చేస్తోందని ప్రకటించారు.

323 కిలోల గంజాయి పట్టివేత

- 5 వాహనాలు స్వాధీనం చేసుకున్న పోలీసులు



గచ్చపడా పోలీసులు స్వాధీనం గంజాయి బస్తాలతో నిందితులు



గంజాయి మొక్కలను ధ్వంసం చేస్తున్న అధికారుల బృందం

బరంపురం: గంజాం, కొందమాల్ జిల్లాల పోలీసులు మంగళ, బుధవారాల్లో సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఇందులో అక్రమంగా తరలిస్తున్న గంజాయి రవాణాకు అడ్డకట్ట వేశారు. 2 వేర్వేరు వాహనాల్లో 323 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కొందమాల్ ఎస్పీ సుబేందు కుమార్ పాత్రొ తెలిపిన వివరాల ప్రకారం... జిల్లాలోని బల్లిగుడా అటవీ ప్రాంతం నుంచి బరంపురం వైపు వెళ్తున్న వ్యాన్, 3 ద్విచక్ర వాహనాల్లో అక్రమంగా గంజాయి రవాణా జరుగుతున్నట్లు ముందస్తు సమాచారం అందింది. అప్రమత్తమైన గచ్చపడా పోలీసులు కళింగా ఘాటీలో రెక్కీ నిర్వహించారు. గంజాం సరిహద్దులో ప్రవేశిస్తున్న వ్యాన్‌పై దాడి చేయగా, 20 బస్తాల్లో 250 కిలోల గంజాయి పట్టుబడింది. వాహనంతో పాటు మూడు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. అయితే నిందితులు తప్పించుకోగా, ఆచూకీ కోసం గాలిస్తున్నారు. అలాగే గంజాం జిల్లా దిగపండి పోలీసులు డెంగపదర జంక్షన్‌లో అనుమానాస్పదంగా తిరుగాడుతున్న ఆటోపై దాడి చేయగా, 5 బస్తాల్లో 73కిలోల గంజాయి పట్టుబడింది. ఆటోను స్వాధీనం చేసుకొని, ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశామని ఐఐసీ అధికారి రంజిత్‌కుమార్ మున్ని వెల్లడించారు.

గంజాయి సాగు ధ్వంసం..

కొరాపుట్: జిల్లాలోని మాచ్‌ఖండ్ ప్రాంతంలో గంజాయి సాగును అధికారులు ధ్వంసం చేశారు. నందపూర్ ఎస్‌డీపీఓ సంజయ్ మహాపాత్రొ తెలిపిన వివరాల ప్రకారం.. మాచ్‌ఖండ్ పోలీస్ స్టేషన్ పరిధి హరగండ పంచాయతీలోని అటవీ ప్రాంతంలో గంజాయి సాగు చేస్తున్నట్లు గుర్తించామన్నారు. రెవెన్యూ, అటవీ, ఎక్సైజ్, పోలీసు బృందాలు యుద్ధ ప్రాతిపదికన అక్కడకు చేరుకున్నాయన్నారు. వెంటనే మొక్కలను తొలగించి, నిప్పంటించారు. అయితే మొక్కల సంఖ్య, విస్తీర్ణం వివరాలు త్వరలో ప్రకటస్తామని ఎస్‌డీపీఓ వివరించారు.

దివ్యాంగుల ఉపాధికి ఎన్నో పథకాలు



వేదికపై ఏడీఎం రాజేంద్ర మాఝి, దిలీప్‌కుమార్



శిబిరానికి హాజరైన దివ్యాంగులు

కొరాపుట్: దివ్యాంగులకు ఉపాధి కల్పించడం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని జిల్లా ఏడీఎం రాజేంద్ర మాఝి అన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కొరాపుట్ జిల్లా కేంద్రంలోని డీడీఆర్‌సీ భవనం ఆవరణలో బుధవారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. జిల్లాలో 8వ తరగతి ఉత్తీర్ణులైన యువతీ, యువకులు ఈ పథకాలకు అర్హులన్నారు. 14 సమితులు, 4 పురపాలక సంఘాల పరిధిలో ఉన్న దివ్యాంగులను ఉపాధి మార్గంలో నిలిపేందుకు బాటలు వేస్తామన్నారు. అనేక వృత్తివిద్యా కోర్సులు నిర్దిష్టకాల పరిమితితో శిక్షణ ఇస్తామని తెలిపారు. అనంతరం దివ్యాంగులకు ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ ఉన్నతాధికారులు దిలీప్‌కుమార్ హియాల్, సిమ్మాంచల్ మహాపాత్రొ, బిపిన్ బిహారి గౌడ, జగన్నాథ తదితరులు పాల్గొన్నారు.

భార్య గొంతు కోసి.. ఆపై తాను కూడా

- కొడికాపాడి గ్రామంలో ఘటన



రక్తపు మడుగులో సునీత మృతదేహం



గొంతుపై బలమైన గాయంతో సాంబాడొ

రాయగడ: భార్య గొంతు కోసి హత్య చేసిన అనంతరం భర్త కూడా అదే కత్తితో తనను తాను కోసుకున్న ఘటన జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరి పంచాయతీలో బుధవారం చోటు చేసుకుంది. దీనిపై పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తొయాపుట్ గ్రామానికి చెందిన సాంబాడొ మఝి(28)కి, శంకరాడ పంచాయతీ లోని కొడికాపాడి గ్రామానికి చెందిన సునీత(25)తో మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. అన్యోన్యంగా సాగుతున్న వారి దాంపత్యంలో రెండేళ్ల కుమార్తె కూడా ఉంది. అయితే గత కొద్ది నెలలుగా ఇద్దరి మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. దీంతో తరచూ గొడవలు జరుగుతుండేవి. దీంతో సునీత తన కన్నవారు ఉండే కొడికాపాడి గ్రామానికి కుమార్తెతో సహా వెళ్లిపోయింద. మంగళవారం భార్య వద్దకు వెళ్లిన సాంబాడొ.. తొయాపుట్‌కు వెళ్లిపోదామని పిలిచాడు. దీనికి ఆమె ససేమిరా అంగీకరించక పోవడంతో బుధవారం మరోసారి ఆమెను కలిసి ప్రాధేయపడ్డాడు. అప్పటికీ వినక పోవడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కోపోద్రిక్తుడైన సాంబాడొ.. పక్కనే ఉన్న పదునైన కత్తితో భార్యపై దాడి చేశాడు. రక్తపు మడుగులో ఆమె అక్కడిక్కడే కుప్పకూలి పోయింది. భయాందోళనకు లోనైన భర్త స్వగ్రామమైన తొయాపుట్ వెళ్లిపోయి, అక్కడ తాను కూడా కత్తితో గొంతు కోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయాన్ని గమనించిన ఇరుగు–పొరుగు వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. 108 సాయంతో టికిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం రాయగడ ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ మద్యం స్వాధీనం



పట్టుబడిన నకిలీ మద్యం బాటిళ్లు, నిందింతులతో పోలీసులు

బరంపురం: నగరంలోని ఎక్సైజ్ విభాగం గత కొద్ది రోజులుగా చేపట్టిన దాడుల్లో వేలాది లీటర్ల విదేశీ నకిలీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. తాజాగా బరంపురం–ఛత్రపూర్ మధ్య బుధవారం నిర్వహించిన ఆకస్మిక దాడుల్లో భారీగా విదేశీ నకిలీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. ఎక్సైజ్ అధికారి గీతాంజలి సాహు తెలిపిన వివరాల ప్రకారం జిల్లాలోని చమ్మాఖండి పోలీసు స్టేషన్ పరిధి బొనుగునాపల్లి గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన నకిలీ మద్యం నిల్వలను పట్టుకున్నారు. ఇందులో 46లీటర్ల నకిలీ మద్యంతో పాటు లేబుళ్లు, తయారీ యంత్రాలు, బైకును స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి, కేసు నమోదు చేశామని వివరించారు.

కొలువుల పంట



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న సెంచూరియన్ యాజమాన్యం

పర్లాకిమిడి: సెంచూరియన్ వర్సిటీ క్యాంపస్‌లో బుధవారం ప్రాంగణ ఎంపికలు జరిగాయి. ఐటీసీ, ఇఫ్‌కో కిసాన్, బీఏఐఎఫ్, ప్రొఫార్మా ఇండియా పరిశ్రమలు ఇంటర్వ్యూలు నిర్వహించాయని ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎన్.కామేశ్వరరావు తెలిపారు. ఇందులో రూ.8.5 లక్షల వార్షిక వేతనంతో 10మంది అగ్రికల్చర్ విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని వెల్లడించారు. వీరందరికీ ధ్రువపత్రాలు అందించామన్నారు. మరికొద్ది రోజుల్లో బీఎస్సీ, బీటెక్(అగ్రికల్చర్) పూర్తి చేసుకోనున్న విద్యార్థలకు కోరమండల్ ఇంటర్‌నేషనల్, సిజెంటా ఇండియా, ఏరిస్ ఆగ్రో, నాగార్జునా ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్, ఐసీఐసీఐ, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ కంపెనీలు సైతం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎంపికైన అభ్యర్థులను సెంచూరియన్ వర్సిటీ ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ డీఎన్ రావు, వైస్ చాన్సలర్ సుప్రియా పట్నాయక్, రిజిస్ట్రార్ డాక్టర్ అనితా పాత్రొ తదితరులు అభినందించారు.

క్లుప్తంగా

ఏఓబీలో చెక్‌పోస్టు ఏర్పాటు


వాహనాలను తనిఖీలు చేస్తున్న పోలీసులు

పాతపట్నం: ఆంధ్ర-ఒడిశా సరిహద్దు ప్రాంతం పాతపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద బుధవారం పోలీసులు, రెవెన్యూ అధికారులు చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పాతపట్నం సీఐ ఎం.వినోద్‌బాబు, ఎస్‌ఐ కామేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది ఒడిశా నుంచి వస్తున్న వాహనాలను తనిఖీ చేశారు.

కూచిపూడి నృత్య పోటీల్లో కోటబొమ్మాళి వాసి ప్రతిభ


వారణాసి ఎమ్మెల్యే సూరభ్ శ్రీవాత్సవ నుంచి అవార్డు స్వీకరిస్తున్న నర్సింహరావు

కోటబొమ్మాళి: మహారాష్ట్రలోని కాశీవిశ్వేశ్వర స్వామి వారి సన్నిధిలో వాగ్దేవి విద్యా సంగీత కళా నృత్య సంస్కృతి సంస్థ వారు ఈ నెల 12, 13 తేదీల్లో నిర్వహించిన కూచిపూడి నృత్య పోటీల్లో కోటబొమ్మాళి శ్రీదేవి నృత్యాలయానికి చెందిన కర్రి నర్సింహరావు మంచి ప్రతిభ కనబర్చారు. ఏటా మాఘమాసంలో పోటీలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఏడాది నిర్వహించిన పోటీల్లో దేశ వ్యాప్తంగా ఏడు వందల మంది కళాకారులు పోటీపడగా నర్సింహరావు ప్రథమ స్థానంలో నిలిచి బహుమతి సొంతం చేసుకున్నారు. వారణాసి శాసనసభ్యుడు సూరభ్ శ్రీవాత్సవ చేతులమీదుగా శివపాద నర్తన అవార్డును నర్సింహరావు స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్గనైజర్ బి.నాగేంద్ర పాల్గొన్నారు.

104, 108 వాహనాలకు 5జీ సేవలు


104 వాహనంలో 5జీ సేవలను అప్‌డేట్ చేస్తున్న సిబ్బంది

టెక్కలి రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగానికి పెద్దపీట వేస్తున్నారు. దానిలో భాగంగా కొత్తగా 108, 104 వాహనాలను ఏర్పాటు చేశారు. అయితే ఆ వాహనాలకు 2జీ సేవలు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. దీంతో అత్యవసర సమయాల్లో సమాచారాన్ని వేగవంతంగా తెలుసుకోవడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 104, 108 వాహనాలకు 5జీ సేవలకు అప్‌గ్రేడ్ చేస్తున్నారు. బుధవారం విజయవాడ నుంచి సిస్టమ్ ఇంటిగ్రేటర్ అధికారి వెంకటేష్, జిల్లా ఐటీ సిస్టం సమీకృత అధికారి సయ్యద్ ఇబ్రహీం టెక్కలి జిల్లా ఆస్పత్రి పరిధిలో ఉన్న 104, 108 వాహనాలకు 5జీ సేవలను అప్‌గ్రేడ్ చేశారు. దీని ద్వారా సేవలకు సంబంధించిన సమాచారం వేగవంతంగా అందుతోందన్నారు.

పీడీఎస్ బియ్యం సీజ్

ఎల్.ఎన్.పేట: మండలంలోని చొర్లంగి గ్రామంలో ఎం.సూర్యనారాయణ ఇంటి పక్కన ఉన్న పశువుల షెడ్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన 10 టన్నుల 315 కేజీల పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకున్నామని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై బి.రామారావు తెలిపారు. రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉన్నాయన్న సమాచారం మేరకు విజిలెన్స్ ఎస్పీ ఎ.సురేష్‌బాబు సూచనల మేరకు బుధవారం దాడులు నిర్వహించామన్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని వీఆర్వో సింహాచలానికి అప్పగించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎల్.ఎన్.పేట సీఎస్‌డీటీ డబ్బీరు రామకృష్ణ, విజిలెన్స్ హెచ్‌సీ రామ్మోహన్‌రావు, పీసీ ఈశ్వరరావు, శేషగిరి పాల్గొన్నారు.

ఎఫ్‌బీఐ ముద్దు.. సీబీఐ కద్దు!


ఒడిశా అసెంబ్లీ

- రాష్ట్ర ప్రభుత్వం తీరుపై బీజేపీ ఎద్దేవా
- మంత్రి కిషోర్‌దాస్ హత్య దర్యాప్తును అమెరికాకు అప్పగిస్తామనడంపై అభ్యంతరం

భువనేశ్వర్:

రాష్ట్ర ఆరోగ్య-కుటుంబ సంక్షేమశాఖ మంత్రి నవకిషోర్ దాస్ హత్య కేసుపై కొనసాగుతున్న రాజకీయ దుమారంపై ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అసెంబ్లీలో చేసిన ప్రకటన మరింత ఆజ్యం పోసింది. నిందితుల ప్రవర్తనా విశ్లేషణ కోసం ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్(ఎఫ్‌బీఐ) సాయం ప్రభుత్వం కోరుతానడం పట్ల భారతీయ జనతాపార్టీ బుధవారం విరుచుకు పడింది. ఈ పరిస్థితులు ప్రధాన నిందితుడు గోపాల్‌దాస్‌ను విచారించడంలో క్రైంశాఖ దర్యాప్తు పూర్తిగా గాడి తప్పినట్లు స్పష్టం అవుతోందని దుయ్యబట్టింది. సీబీఐ పట్ల విశ్వాసం లేని రాష్ట్రప్రభుత్వం ఎఫ్‌బీఐను ఆశ్రయించడం దురదృష్టకరమని బీజేపీ సీనియర్ నేత సురేష్ పూజారి విమర్శించారు. పాలిగ్రాఫ్, నార్కో అనాలిసిస్, ఫోరెన్సిక్ సైకలాజికల్ అసెస్‌మెంట్, లేయర్డ్ వాయిస్ విశ్లేషణ(ఎల్‌వీఏ) పలు అనుబంధ పరీక్షల కోసం ఇప్పటికే కేంద్ర ఏజెన్సీల సహాయం తీసుకున్నప్పుడు.. కేసును సీబీఐకి అప్పగించడానికి బీజేడీ నేతృత్వంలోని ప్రభుత్వం విముఖతను అర్థం చేసుకోవడంలో అంతర్యమేంటని నిలదీశారు. దర్యాప్తు అంశాన్ని ప్రతిపక్షాలు రాజకీయం చేస్తున్నాయని సీఎం నిందించడంపై పూజారి మాట్లాడుతూ.. అసలు హంతకుడి ఆచూకీ కనిపెట్టాలని బీజేపీ కోరుతోందన్నారు. మూడు వారాల తర్వాత కూడా, క్రైం బ్రాంచ్ హత్య వెనుక లక్ష్యం మరియు ఉద్దేశాన్ని ఇంకా నిర్ధారించలేదని ఆక్షేపించారు.


సురేష్ పూజారి


జయనారాయణ మిశ్రా

సీఎం ప్రకటన అగమ్యగోచరం..

ఈ ఘటనపై దీర్ఘకాలం మౌనం వహించిన ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆలస్యంగా మేలుకొని సభలో అగమ్యగోచర వైఖరి ప్రదర్శించారని సంబల్‌పూర్ ఎమ్మెల్యే, బీజేపీ విపక్షనేత జయనారాయణ్ మిశ్రా వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి నవీన్ మేల్కొనేందుకు 24 రోజులు పట్టిందని ఎద్దేవా చేశారు. ఈ కేసు తాజా స్థితిగతుల పట్ల ఏమాత్రం అవగాహన లేదని, కాగితంపై ముందస్తుగా రూపొందించిన వివరణను సభలో చదివి వినిపంచారని ఆరోపించారు. మంత్రి హత్య కేసులో నిందిత గోపాల్‌దాస్ పాత్రను నిర్ధారించే దిశలో మాత్రమే విచారణ కొనసాగుతోందన్నారు. ఈ దురదృష్టకర ఘటన వెనుక ఉన్న వ్యక్తుల ఆచూకీని కనుగొనే దిశలో క్రైంశాఖ అడుగులు వేయడం లేదని విమర్శించారు. ప్రజలంతా గుర్తించిన అంశాన్నే సీఎం సభలో కొత్తగా ప్రవేశ పెట్టడంలో ప్రాధాన్యత ఏముందని నిలదీశారు. కేంద్ర ఏజెన్సీల ద్వారా అన్ని పరీక్షలు నిర్వహిస్తున్నప్పటికీ కేసును సీబీఐకి అప్పగించేందుకు ప్రభుత్వం భయపడుతోందని ధ్వజమెత్తారు. దర్యాప్తును పర్యవేక్షించేందుకు ఒడిశా హైకోర్టు రిటైర్డ్ జడ్జిని నియమించామంటూ సీఎం ప్రజలకు అబద్ధాలు చెబుతున్నారని, పారదర్శకత పాటిస్తామంటూ ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. విశ్రాంత న్యాయమూర్తి(జస్టిస్ జేపీ దాస్) దర్యాప్తును పర్యవేక్షిస్తారని పేర్కొన్నా.. ఎటువంటి న్యాయపరమైన ఉత్తర్వు లేదని, ఎటువంటి షరతులు విధించలేదని విమర్శించారు.

మంత్రిపై పరువు నష్టం దావా..

తనపై బిజూ జనతా దళ్ దుష్ప్రచారంపై స్పందిస్తూ, ఈ కేసులో తన పేరును, కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పేరును ప్రస్తావించినందుకు రెవెన్యూ, విపత్తు నిర్వహణశాఖ మంత్రి ప్రమీలా మల్లిక్‌పై పరువు నష్టం దావా వేస్తానని బీజేపీ ఎమ్మెల్యే జయనారాయణ్ మిశ్రా ప్రకటించారు. 'మంత్రిగా ఉన్న ఆమె చేసే ఏ ప్రకటన అయినా ప్రభుత్వ ప్రకటనగా పరిగణించబడుతుంది. ఇది కొనసాగుతున్న దర్యాప్తును కూడా ప్రభావితం చేస్తుంది. అధికార పార్టీ నేతలు నన్ను నేరస్తునిగా సంబోధించడంపై అభ్యంతరకరం. ఇప్పటి వరకు ఏ నేరారోపణ జరగలేదు. పోలీసుల ఛార్జిషీట్‌లో నా పేరు పేర్కొనలే'దని గుర్తుచేశారు. అధికార బిజూ జనతాదళ్‌లో 111మంది శాసనసభ్యులు నేరారోపణలు ఎదుర్కొంటున్నారు, ఆరుగురిపై హత్య ఆరోపణలు, నలుగురిపై కిడ్నాప్ కేసులు నమోదయ్యాయి. అటువంటి ప్రకటనలు చేసే ముందు పార్టీ ఒకటికి రెండుసార్లు ఆలోచించాలి హితవు పలికారు.

డిమాండ్ల పరిష్కరించాలంటూ ధర్నా


జిల్లా వెటర్నరీ అధికారికి వినతిపత్రం అందిస్తున్న ఉద్యోగులు

పర్లాకిమిడి: జిల్లాలో గత ఎనిమిదేళ్లుగా పని చేస్తున్న నాన్ గెజిటెడ్ వెటర్నరీ డిప్లమో, సాంకేతిక సిబ్బందికి గ్రేడ్ పే, డీఏ, ఇతర సౌకర్యాలు వర్తించడం లేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు అఖిల భారత నాన్ గెజిటెడ్ వెటర్నరీ టెక్నికల్ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పశుసంవర్ధక శాఖ ప్రధాన కార్యాలయం ఆవరణలో మంగళవారం ధర్నా చేపట్టారు. కేడర్ జాబితా రూపొందించి పదోన్నతి కల్పించాలని, ఉద్యోగ నియామకాలలో పారదర్శకత పాటించడంతో పాటు 2015 నుంచి చేస్తున్న పని చేస్తున్న వారి హోదాలో మార్పులు చేపట్టాలని కోరారు. వీటిని ప్రభుత్వం అమలు చేయకుంటే జిల్లావ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని సంఘం జిల్లా అధ్యక్షుడు గౌరహరి బెహరా హెచ్చరించారు. ఈ మేరకు జిల్లా వెటర్నరీ ముఖ్యఅధికారి గిరీష్ మహంతిని కలిసిన సంఘం కార్యదర్శి బిభూతి భూషన్ గంతాయత్, గౌరహరి బెహరా, ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు.

'ఉపాధి'లో అక్రమాలపై దర్యాప్తుకు డిమాండ్


ఆందోళన చేస్తున్న కిసాన్ మజ్దూర్ సంఘ్ నాయకులు

రాయగడ: జిల్లాలోని మునిగుడ సమితి పాత్రొగుడ పంచాయతీలో చేపట్టిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనుల్లో చోటు చేసుకున్న అవినీతిపై అధికారులు స్పందించాలని అఖిల భారత కిసాన్ మజ్దూర్ సంఘ్ నాయకులు కోరారు. దీనిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేస్తూ సమితి కార్యాలయం ఎదుట మంగళవారం ఆందోళనకు దిగారు. సంఘం రాష్ట్రశాఖ అధ్యక్షుడు గౌలొచంద్ర షడంగి నేతృత్వంలో నిర్వహించిన ఆందోళనలో కిసాన్ మోర్చా కార్యకర్తలు, పంచాయతీ ప్రజలు పాల్గొన్నారు. పంచాయతీలోని పాత్రొగుడ, ఖులుగుడ, బుర్జుగుడ, ఖురుచిమారో, జమరగుడ, ఛెలియానాలో, కొరొడాబొంధో తదితర గ్రామాల్లో జరిగిన ఉపాధిహామీ పథకంలో చెరువు పనులు, గార్డ్‌వాల్, రహదారులు తదితర అభివృద్ధి పనుల్లో ఎటువంటి నాణ్యత లేకపోవడంతో పాటు పనులు పూర్తి కాకుండానే బిల్లులు చెల్లించారని ఆరోపించారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఆందోళనలో కిసాన్ మజ్దూర్ సంఘ్ సమితి అధ్యక్షుడు కినేంద్ర, కార్యదర్శి నరేష్ సునా, పద్మనాభ ఛౌదరి తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్‌లో ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు పరిధిలోని కాకతీయ పబ్లిక్ స్కూల్‌లో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థి మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. న్యూపోర్టు ఎస్‌ఐ మన్మథరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా లోని కోరాపుట్ జిల్లా పొట్టంగి సమితి గంగరాజ్‌పూర్‌కు చెందిన ఆశిష్ జయపురియా(18) కాకతీయ పబ్లిక్ స్కూల్‌లో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ఆ పాఠశాలకు చెందిన ఐటీఐ హాస్టల్‌లో ఉంటున్నాడు. ఈనెల 21న రాత్రి 8 గంటల సమయంలో హాస్టల్‌లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన పాఠశాల యాజమాన్య ప్రతినిధులు వెంటనే విద్యార్థిని గాజువాకలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అయితే ఆశిష్ అప్పటికే మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించారు. అనంతరం విద్యార్థి తండ్రి పూర్ణ జయపురియాకు సమాచారం అందజేశారు. హుటాహుటిన ఇక్కడకు చేరుకున్న కుటుంబ సభ్యులు.. న్యూపోర్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ మన్మథరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. విద్యార్థి ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఆశిష్ మృతదేహం

వివాహమైన ఎనిమిది నెలలకే..


తాళ్ల స్నేహ(ఫైల్)

మందస: అందమైన కలలతో జీవితాన్ని ఊహించుకున్న ఆమెకు ఏం కష్టమొచ్చిందో గానీ ఆత్మహత్య చేసుకుంది. ఆనందంగా గడపాల్సిన వయస్సులో అందని లోకాలకు వెళ్లిపోయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మందస మండలం ఉద్దాన ప్రాంతమైన దున్నవూరు పంచాయతీ కొత్తపితాళి గ్రామానికి చెందిన తాళ్ల స్నేహ(21)కు భేతాళపురం గ్రామానికి చెందిన బత్తిని విజయ్‌తో ఎనిమిది నెలల క్రితం వివాహం జరిగింది. విజయ్ నేవీలో ఉద్యోగం చేస్తూ తమిళనాడులో ఉంటున్నారు. ఇంతలో ఏమైందో గానీ స్నేహ కొత్తపితాళిలోని కన్నవారి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఊయల కొక్కేనికి చీరతో ఉరి వేసుకుంది. ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు హుటాహుటిన హరిపురం సామాజిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు. అప్పటికే ఆమె మరణించినట్టు వైద్యులు ధృవీకరించారు. స్నేహ తల్లి భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ వై.రవికుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

దీనబంధుపురంలో అగ్ని ప్రమాదం

- రేకిల్లు, పశువుల శాలలు దగ్ధం

మెళియాపుట్టి: దీనబంధుపురం గ్రామంలో బుధవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఒక రేకు ఇల్లు, పశువుల శాలలు, వ్యవసాయ కోతమిషన్ దగ్ధమయ్యాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం సంభవించింది. ఘటనలో హరిపురం పున్నయ్యకు చెందిన రేకిల్లు కాలిపోవడంతోపాటు ఒకవైపు గోడకూలిపోయింది. పున్నయ్య ఇంట్లో ఆదివారం శుభకార్యం జరగాల్సి ఉంది. దీనికి కోసం తీసుకొచ్చిన బట్టలు, బియ్యం, సరుకులు, రూ.20 వేల నగదు కాలిపోయినట్లు బాధితుడు తెలిపారు. అలాగే పక్కనే ఉన్న జన్ని సోమేష్, జన్ని సుందరమ్మ, పడాల సోమయ్యల పశువుల శాలలు, హరిపురం రామారావుకు చెందిన వ్యవసాయ కోతమిషన్ బూడిదయ్యాయి. ఆర్‌ఐ వైకుంఠరావు, వీఆర్వో రాజు, కార్యదర్శి శంకర్ ఘటనా స్థలాన్ని సందర్శించి బాధితులతో మాట్లాడారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. నష్టం అంచనావేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. గ్రామ సర్పంచ్ సవర కావేరి బాధితులకు బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు.


కాలిపోయిన ఇల్లు

పోస్టల్ ఉన్నతాధికారుల వేధింపులు ఆపాలి

శ్రీకాకుళం అర్బన్: తపాలాశాఖలో ఆచరణ సాధ్యం కాని టార్గెట్ల పేరుతో ఉన్నతాధికారులు వేధింపులకు గురి చేస్తున్నారని, వెంటనే వీటిని ఆపాలని ఆంధ్రప్రదేశ్ తపాలా ఉద్యోగుల సంఘాలు (ఎన్‌ఎఫ్‌పీఈ-ఎఫ్‌ఎన్‌పీవో) ప్రతినిధులు డిమాండ్ చేశారు. శ్రీకాకుళం ప్రధాన తపాలా శాఖ కార్యాలయం వద్ద బుధవారం తపాలా ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదేళ్లుగా ప్రతి సంవత్సరం మార్చిలో టార్గెట్ల పేరుతో అధికారులు ఉద్యోగులపై ఒత్తిడి చేయడం తగదన్నారు. గత నెల 28న దేశ వ్యాప్తంగా ఒక్క రోజుకోటి కొత్త అకౌంట్లు తెరవాలని లక్ష్యాలు విధించారని, మళ్లీ ఈ నెల 9, 10 తేదీల్లో ఒక్క రోజులో 7.5 లక్షల సుకన్య సమృద్ధి యోజన ఖాతాలు తెరవమని టార్గెట్లు విధించారన్నారు. తాజాగా ఈ నెల 20 నుంచి 24 వరకు ప్రతి పోస్టాఫీసులో 50 అకౌంట్లు తెరవాలని లక్ష్యం విధించడం దారుణమన్నారు. ఇలాంటి ఒత్తిళ్ల వల్ల ఇటీవల మచిలీపట్నంలోని పామర్రు బజారు సబ్ పోస్టుమాస్టర్ గుండెపోటుతో అకాల మరణం చెందారని చెప్పారు. ఇకనైనా వేధింపులు ఆపకపోతే మార్చి 9న విజయవాడలోని చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ ఆఫీసు ముట్టడి చేయాలని ఉద్యోగ సంఘాలు నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పోస్టల్ ఉద్యోగ సంఘాల నాయకులు గణపతి, బాబూరావు, జ్యోతీశ్వరరావు, వేణుగోపాలరావు, రాంబాబు, రమేష్, డిల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


ప్రధాన తపాలా శాఖ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

మార్చి 7న డోలోత్సవం

- పూరీ శ్రీమందిరం 36 నియోగుల సమావేశంలో షెడ్యూల్ ఖరారు


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీమందిరం సీఏఓ వీరవిక్రమ యాదవ్

భువనేశ్వర్: పూరీ జగన్నాథ స్వామి డోలోత్సవం కార్యక్రమం ఖరారైంది. స్థానిక బొడొదండొ నీలాద్రి భక్తి నివాస్‌లో బుధవారం జరిగిన పాలసీ సబ్‌కమిటీ, 36 నియోగుల సమావేశంలో ఈ షెడ్యూల్ ఖరారు చేశారు. శ్రీమందిరం ప్రధాన పాలనాధికారి (సీఏఓ) వీరవిక్రమ యాదవ్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. మార్చి 6న అగ్ని ఉత్సవం, 7న డోలా పూర్ణిమ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా స్వామి స్వర్ణాలంకరణ చేపడతారు. శ్రీమందిరం చుట్టూ కారిడార్ ప్రాజెక్టు పనులు జరుగుతున్నందున, పల్లకిలో ఉత్సవ మూర్తులను డోలోత్సవ మండపానికి సురక్షితంగా తరలించే విధానం ఛత్తీష(36) నియోగ సభ్యుల సమావేశంలో నిర్ధారించారు. భక్తులకు సంతృప్తికరమైన దర్శన వ్యవస్థను మార్చి 2 నాటికి ఖరారు అవుతుందని అధికారులు తెలిపారు. పౌర్ణమి పురస్కరించుకుని డోలోత్సవం నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో జగన్నాథుని ఉత్సవమూర్తి డోలో గోవిందుడు, భూదేవి, శ్రీదేవి పల్లకిలో ఊరేగింపుగా మండపానికి వేంచేస్తారు. మండపం ప్రదక్షిణ అనంతరం పూజాదికాలు ముగించి మూర్తులను మండపంపై నెలకొల్పుతారు. దీనిని పురస్కరించుకుని ఉత్సవ మూర్తులను నాభికొటా మండపానికి తరలిస్తారు. ఉదయం 9.30 గంటలకు శ్రీమందిరంలో మూలవిరాట్‌ల సునాభేష్(స్వర్ణ అలంకరణ) పూర్తిచేయాలని నిర్ణయించారు. ఉదయం 10 గంటలకు ఉత్సవ మూర్తులను పల్లకిలో డోలోత్సవ మండపానికి తరలిస్తారు. రాత్రి 9.30 గంటల వరకు భక్తులు డోలోత్సవ మండపంపై దేవుళ్లను దర్శించుకోవచ్చు. ఆలయ పాలకవర్గం, జిల్లా యంత్రాంగం ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ సమర్థ వర్మ, పోలీసు సూపరింటెండెంట్ డాక్టర్ కన్వర్ విశాల్‌సింగ్, పాలకమండలి సభ్యులు, 36 నియోగ్ ప్రతినిధులు పాల్గొన్నారు.


సన్నాహక సమావేశానికి హాజరైన 36 నియోగుల సంఘం సభ్యులు

మృతి చెందిన వ్యక్తి ఆచూకీ లభ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని 16వ నంబరు జాతీయ రహదారిపై తమ్మినాయుడుపేట పంచాయతీ సనపలవానిపేట సమీపంలో సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి మృతి చెందిన వ్యక్తి ఆచూకీ తెలిసింది. మృతుని ప్యాంట్ జేబులో ఉన్న ఫోన్ నంబర్ల ఆధారంగా అతని ఆచూకీ తెలిసిందని ఎచ్చెర్ల పోలీసులు చెప్పారు. మృతినిది ఝార్ఖండ్ రాష్ట్రం కుర్డైజేసిమ్మెడ్ ప్రాంతానికి చెందిన కుజూర్ ప్రకాష్‌గా గుర్తించారు. పోలీసుల సమాచారం మేరకు బుధవారం ఇక్కడకు చేరుకున్న కుటుంబ సభ్యులు శ్రీకాకుళం రిమ్స్‌లో భద్రపరిచిన మృతదేహాన్ని చూసి కుజూర్ ప్రకాష్‌గా గుర్తించారు. అనంతరం పోస్టుమార్టం నిర్వహించారు. స్థానికంగా ఓ పరిశ్రమలో కార్మికునిగా ప్రకాష్ పని చేస్తుండేవాడు. ఈ ప్రాంతానికి ఎందుకు వచ్చాడు, ఢీ కొట్టిన వాహనం ఏమిటన్నది తెలియ రాలేదు. ఎస్సై వి.సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాన్ షాపులో చోరీ

టెక్కలి రూరల్: పరశురాంపురం జంక్షన్ వద్ద జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న పాన్‌షాపులో బుధవారం చోరీ జరిగిందని యజమాని కంబాల రవికుమార్ తెలిపారు. బుధవారం ఉదయం షాపు తెరిచే సమయానికి అందులోని సిగరెట్లు, కూల్‌డ్రింకులతో కొంత నగదు చోరీకి గురైనట్టు గుర్తించామన్నారు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులు వివరాలు నమోదు చేశారు.

దుప్పలవలసలో కొట్లాట

- ఇద్దరికి గాయాలు

ఎచ్చెర్ల క్యాంపస్: దుప్పలవలస గ్రామంలో ఇరువర్గాల మధ్య బుధవారం కొట్లాట జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. గ్రామ రెవెన్యూ పరిధిలో ఉన్న భూమిపై వివాదం తలెత్తిందని పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో ఇరువర్గాల ఫిర్యాదు మేరకు 16 మందిపై కేసు నమోదు చేశామన్నారు. సర్వే నంబర్ 160-6లో ఉన్న 1.98 ఎకరాల భూహక్కుకు సంబంధించి వివాదం చోటు చేసుకుందని చెప్పారు. ఈ సంఘటనలో వెంకటసాయిరాం, రాజేశ్వరి గాయపడడంతో వీరిని చికిత్స కోసం శ్రీకాకుళంలోని రిమ్స్‌కి తరలించినట్టు చెప్పారు. కేసును రెవెన్యూ శాఖకు రిఫర్ చేయనున్నట్టు ఎస్సై సత్యనారాయణ చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.


గాయపడిన వెంకటసాయిరాం, రాజేశ్వరి

అనుమానాస్పద పార్శిళ్ల తనిఖీ

కాశీబుగ్గ:

పలాస ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని లాజిస్టిక్స్ పార్సెల్ సర్వీస్ కౌంటర్‌లో అసిస్టెంట్ మేనేజర్ పి.సంతోష్ కుమార్ సమక్షంలో అనుమానాస్పద పార్శిళ్లను సిబ్బంది బుధవారం తనిఖీ చేశారు. అనంతరం కాంప్లెక్స్‌లో ప్రయాణికులతో మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ కోన కృష్ణారావు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఆదేశాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ డ్రగ్ ఫ్రీ రాష్ట్రంగా మార్చేందుకు చేసినటువంటి ప్రణాళికలో భాగంగా తనిఖీ చేస్తున్నామన్నారు. గంజాయి, నల్లమందు, బ్రౌన్ సుగర్, కొకైన్, కోడెక్స్ మొదలగు మాదక ద్రవ్యాలు రవాణాకు డ్రగ్స్ మాఫియా ఈ పార్శిళ్ల సర్వీసెస్‌ను ఎంచుకుని కొన్ని రకాల నిత్యావసర వస్తువుల పార్శిల్ రూపములో రహస్యముగా ఒడిశా తదితర రాష్ట్రాల నుండి ఆంధ్రప్రదేశ్‌కు సరఫరా చేస్తున్నారన్నారు. దీన్ని నివారించేందుకు ఆర్టీసీ అధికారుల సహకారంతో కృషి చేస్తున్నామన్నారు. కాశీబుగ్గ సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రెంటికోట, అల్లుకోల, తర్లాకోట గ్రామాల్లో విద్యార్థులకు మహిళలపై దాడులు నిరోధించాలని నాటక రూపంలో కళాబృందాలు అవగాహన కల్పించాయి.


అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

న్యూస్‌రీల్

పనుల నాణ్యతలో రాజీ పడొద్దు

● ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్



కల్లటిలో సీసీరోడ్డు, కాలువ పనులను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

గుమ్మలక్ష్మీపురం: గిరిజన గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల నాణ్యతలో రాజీపడొద్దని పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సి.విష్ణుచరణ్ గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీర్లతో అన్నారు. మండలంలోని కల్లటి, కీసరగూడ గ్రామాల్లో చేపట్టిన, చేపడుతున్న సీసీ రోడ్లు, మురుగు నీటి కాలువల పనులను ఆయన బుధవారం పరిశీలించారు. చేపడుతున్న పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి, సకాలంలో పూర్తి చేసి గిరిజనులకు సౌకర్యాలు సత్వరమే కల్పించేలా అధికారులు, కాంట్రాక్టర్లు చొరవ తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆయన గుమ్మలక్ష్మీపురం ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్, గ్యాస్ గొడౌను, పెట్రోల్ బంకును సందర్శించి, రికార్డులు, నిల్వలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అటవీ ఫలసాయాల కొనుగోలు తీరుపై జీసీసీ డివిజనల్ మేనేజర్ వి.మహేంద్రకుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జీసీఎంఎస్ మేనేజర్ కృష్ణప్రసాదరావు, గొడౌం ఇన్‌చార్జి ఎం.సాంబశివరావు ఉన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

● రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఎం.డి లక్ష్మీశా



ఇళ్ల నిర్మాణాలపై ఆరా తీస్తున్న రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఎం.డి లక్ష్మీశా

పార్వతీపురం: గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డా.లక్ష్మీశా అన్నారు. పార్వతీపురం మండలంలోని నర్సిపురంలో గల జగనన్న కాలనీలో నిర్మాణంలో వున్న ఇళ్లను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రారంభం కాని నిర్మాణాలు ప్రారంభించాలన్నారు. వివిధ దశలలో వున్న నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. పరిశీలనలో గృహ నిర్మాణ సంస్థ పీడీ పి.రఘురాం, డీఈ ప్రసాద్ తదితరులున్నారు.

గిరిజన యువకుల ప్రతిభ



గిరిజన యువకులతో కోచ్

గుమ్మలక్ష్మీపురం: హర్యానా రాష్ట్రం కురుక్షేత్రలో జరిగిన ఆల్ ఇండియా నేషనల్ మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన గిరిజన యువకులు ప్రతిభ కనబరిచారు. రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనపర్చిన పువ్వల దొరబాబు, ఎ.భుజంగరావు, కె.మోహన్‌రావు అనే గిరిజన యువకులు ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు హర్యానాలో జరిగిన జాతీయ స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో అండర్ 35 విభాగంలో పాల్గొన్నారు. ఈ మేరకు దొరబాబు హై జంప్‌లో గోల్డ్ మెడల్, భుజంగరావు 1500 మీటర్ల పరుగు పందెంలో బ్రాంజ్ మెడల్, మోహన్‌రావు హేమర్ త్రోలో బ్రాంజ్ మెడల్ సాధించినట్లు కోచ్ రామచంద్రరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సత్ఫలితాల సాధనకు ప్రత్యేక చర్యలు

● జిల్లా సమన్వయకర్త చంద్రావతి



విద్యార్థులతో భోజనం చేస్తున్న జిల్లా సమన్వయకర్త చంద్రావతి

గరుగుబిల్లి: గురుకుల పాఠశాలల్లో పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలను సాధించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల/కళాశాల జిల్లా సమన్వయకర్త బి. చంద్రావతి అన్నారు. మండల కేంద్రంలోని పాఠశాలను ఆమె బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలను, భోజన నిర్వాహణను ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పదో తరగతి, ఇంటర్మీడియెట్ లో శత శాతం ఉత్తీర్ణతకు కృషి చేయడం జరుగుతుందన్నారు. పబ్లిక్ పరీక్షలకు అవసరమైన మెటీరియల్ ను విద్యార్థులకు పంపిణీ చేయడం జరిగిందన్నారు. పరీక్షలంటే భయాన్ని పోగొట్టేందుకు విద్యార్థులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించేలా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. పరిశీలనలో ప్రిన్సిపాల్ సిహెచ్. శ్రీదేవి, తదితరులున్నారు.

రహదారిపై మృత్యుఘోష

వారంతా గిరిజనులే... తమ కుటుంబంలో ఒకరి వివాహ నిశ్చితార్థం కోసం సందడిగా బయలుదేరారు. నిశ్చితార్థ కార్యక్రమం కూడా పూర్తయింది. ఆ సంతోషంలో ఎవరి ఇళ్లకు వారు సరదాగా కబుర్లు చెప్పుకుంటూ వెళ్లిన ఆటోలోనే తిరుగు ప్రయాణమయ్యారు. ఇంతలోనే విధికి వారిపై కన్నుకుట్టింది. ఆటోలో సరదాగా తిరిగి వస్తున్న వారిపైకి ఓ మలుపు వద్ద మృత్యువు రూపంలో లారీ దూసుకొచ్చింది. అంతే క్షణాల్లో ఘోర ప్రమాదం జరిగిపోయింది. ప్రమాద స్థలంలోనే నలుగురు మహిళలు దుర్మరణం చెందారు. మరో వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనతో ఆ ప్రాంతమంతా రోదనలతో నిండిపోయింది.

● చోళ్లపదం శివాలయం మలుపు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం
● లారీ ఢీకొని ఆటోలో ప్రయాణిస్తున్న ఐదుగురి మృతి
● అంటివలస గ్రామంలో విషాదం
● కన్నీరుమున్నీరవుతున్న గ్రామస్తులు



ఘటనా స్థలంలో చెల్లా చెదురుగా మృతదేహాలు



సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



ఊయక నరసమ్మ(ఫైల్) మెల్లిక అమ్మడమ్మ(ఫైల్) మెల్లిక శారద(ఫైల్) ఊయక లక్ష్మి(ఫైల్) ఊయక వెంకటి(ఫైల్)

కొమరాడ/పార్వతీపురం:

వివాహ నిశ్చితార్థం కోసం ఆటోలో వెళ్లి తిరిగి వస్తున్న వారిలో ఐదుగురు గిరిజనులు రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డారు. పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండలం చోళ్లపదం శివాలయం మలుపు వద్ద ఆటోను లారీ బుధవారం ఢీకొన్న ప్రమాదంలో ప్రమాద స్థలంలోనే నలుగురు మృత్యువాత పడగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందారు. దీనికి సంబంధించి కొమరాడ ఎస్ఐ జగదీష్‌నాయుడు తెలిపిన వివరాలు.. కొమరాడ మండలం అంటివలస గ్రామానికి చెందిన ఊయక లక్ష్మి కుమార్తె నిశ్చితార్థం కోసం ఊయక నరసమ్మ, ఊయక లక్ష్మి, మెల్లిక శారద, మెల్లిక అమ్మడమ్మ, ఊయక వెంకటిలతో పాటు మరో 9మంది ఆటోలో వివాహ నిశ్చితార్థం నిమిత్తం అదే మండలంలోని తుమ్మలవలస ఆటోలో వెళ్లారు. అక్కడ నిశ్చితార్థ కార్యక్రమం సందడిగా జరిగింది. అనంతరం స్వగ్రామం అంటివలస తిరిగి అదే ఆటోలో వస్తుండగా మార్గమధ్యంలో చోళ్లపదం శివాలయం మలుపు వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఆటోను ఢీకొట్టడంతో పెను ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో అంటివలస గ్రామానికి చెందిన ఊయక నరసమ్మ (54), ఊయక లక్ష్మి (48), మెల్లిక శారద(35), మెల్లిక అమ్మడమ్మ (40) అక్కడికక్కడే మృతి చెందారు. ఊయక వెంకటి(55) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. తక్షణమే స్పందించిన గ్రామస్తులు 108 వాహనం ద్వారా క్షతగాత్రులను పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. అయితే వీరిలో ఊయక రామస్వామి, ఊయక వెంకటేష్‌ల పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం విశాఖపట్నం కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. ప్రమాద విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, అదనపు ఎస్పీ ఓ.దిలీప్‌కిరణ్ ఘటనా స్థలానికి హుటాహుటిన చేరుకుని పరిశీలించారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు అడిగి తెలుసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ తెలిపారు.

అంటివలసలో విషాదం

రెక్కాడితేగాని డొక్కాడని ఆ గిరిజన కుటుంబాలలో ఈ ప్రమాదంతో తీవ్ర విషాదం నెలకొంది. శుభ కార్యం కోసం వెళితే మృత్యువు రూపంలో లారీ గిరిజనుల ప్రాణాలను బలికొంది. అందరితో కలివిడిగా ఉండే ఆ గిరిజనులు రహదారి ప్రమాదంలో విగత జీవులుగా మారడంతో గ్రామంలో విషాదం నెలకొంది. ప్రమాదంలో మృతులంతా ఆయా ఇళ్ల పెద్ద దిక్కు కావడంతో కుటుంబాలు అనాథలుగా మారాయి.

అంతా కూలీలే...

ప్రమాదంలో మృతి చెందిన గిరిజన మహిళలతో పాటు వెంకటి ఏ రోజు కూలి పనులు ఆ రోజు చేసుకుంటూ కుటుంబాలను నెట్టుకొస్తున్నవారే.. ఇప్పుడు ఆ కుటుంబాలకు జీవనాధారం పోయింది. ఈ పరిస్థితుల్లో మిగిలిన కుటుంబ సభ్యులు తమ జీవనమెలా అంటూ రోదిస్తున్నారు. కుటుంబాలకు పెద్ద దిక్కుగా ఉండే తమ వారు ఇలా మృత్యువాత పడడం కలచివేసింది.

అమ్మ రాక కోసం..



అమ్మకోసం ఎదురు చూస్తున్న చిన్నారులు

శుభకార్యానికి వెళ్లిన అమ్మ మెల్లిక శారద రాక కోసం అభం శుభం తెలియని చిన్నారులు ఎదురు చూస్తున్నారు. ఒకవైపు తండ్రి అంధుడు కావడంతో పాటు తల్లి అకాల మరణం చెందడంతో ఆ పిల్లలు అనాథలుగా మారారు. ఆ పిల్లలను చూసి గ్రామస్తులు తల్లడిల్లుతున్నారు. తల్లి మృత్యువాత పడిందన్న విషయం తెలియని ఆ చిన్నారులు తల్లి కోసం దీనంగా చూస్తున్న పరిస్థితి అందరినీ కంటతడి పెట్టించింది.

పరామర్శించిన ఎమ్మెల్యే



క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

రహదారి ప్రమాదంలో క్షతగాత్రులను కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి జిల్లా ఆస్పత్రికి చేరుకొని పరామర్శించారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యాన్ని అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. మృతి చెందిన కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.



అంటివలసలో విషాదం

బాల్య వివాహాలు అరికట్టాలి

● టీనేజ్ గర్భాలను నివారించండి
● కలెక్టర్ ఎ.సూర్యకుమారి
● సఖి, సహేలి గ్రూపుల నిర్వహణపై సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం అర్బన్: జిల్లాలో బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశించారు. అవసరమైతే ప్రభుత్వ చట్టాలను వినియోగించి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. బాల్య వివాహం చట్టరీత్యా నేరమని, తల్లిదండ్రులతోపాటు, వివాహం చేసే పురోహితులు, పాస్టర్లపైనా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. టీనేజ్ గర్భాలను నివారించాలని, దీని కోసం బాలికలను చైతన్య పరచాలని సూచించారు. సఖి, సహేలి గ్రూపుల నిర్వహణపై, కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం సమావేశం నిర్వహించి మండలాలవారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సఖి, సహేలి సమావేశాల్లో స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలని సూచించారు. బాలికలు కూడా డిగ్రీ వరకు చదువుకునేలా చైతన్య పరచాలని 21 ఏళ్లలోపు వివాహం చేసుకోకుండా చూడాలని కోరారు. చిన్నవయసులోనే గర్భం దాల్చడం ద్వారా ఎదురయ్యే దుష్పరిణామాలను వివరించాలని చెప్పారు. బాల్య వివాహాలు ఎక్కడ జరిగినా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రతినెలా సఖి సమావేశాలను తప్పనిసరిగా నిర్వహిస్తూ ఆ గ్రూపు సభ్యులతో మమేకం కావడం ద్వారా క్షేత్రస్థాయిలో వారు ఎదుర్కొంటున్న సమస్యలు, జరగబోతున్న బాల్య వివాహాలను తెలుసుకునే అవకాశం కలుగుతుందని అభిప్రాయ పడ్డారు.

సమన్వయంతో పనిచేస్తే మెరుగైన ఫలితాలు

దీని కోసం వివిధ శాఖల సిబ్బందితో గ్రామ స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామస్థాయిలో మండల స్థాయిలో వివిధ శాఖల అధికారులు సమన్వయంతో కలిసికట్టుగా పనిచేసినపుడే మెరుగైన ఫలితాలు వస్తాయని స్పష్టం చేశారు. ప్రస్తుతం జిల్లాలోని ఆరు మండలాల్లో సుమారు 53 వేల మంది గిరిజనులు ఉన్నారని వారి సమస్యలపై దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు. వారందరికీ ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందించేందుకు కృషి చేయాలని కోరారు. జిల్లాలో 99 శాతం ప్రసవాలు ఆస్పత్రిలోనే జరుగుతున్నాయని, ఇది సంతోషించదగ్గ విషయమని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్‌వీరమణకుమారి, ఐసీడీఎస్ పీడీ బి.శాంతకుమారి, ఎంపీడీఓలు, వైద్యాధికారులు, మహిళా పోలీసులు, యునిసెఫ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పిల్లల పట్ల అప్రమత్తం



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి లక్ష్మీకుమారి

● సివిల్ జడ్జి లక్ష్మీ కుమారి

విజయనగరం లీగల్: పిల్లల పట్ల మనమందరం అప్రమత్తంగా ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సీనియర్ కార్యదర్శి, సివిల్ జడ్జి లక్ష్మీ కుమారి హితవు పలికారు. ఈ మేరకు బుధవారం చైల్డ్ వెల్ఫేర్ పోలీసు అధికారుల ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం స్థానిక జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని చైల్డ్ వెల్ఫేర్ పోలీసు అధికారులు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పిన దగ్గర నుంచి పెంపకం వరకు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. జువైనల్స్ (18 ఏళ్లలోపు) నేరానికి పాల్పడితే వారిపట్ల ప్రవర్తించాల్సిన విధానం, తీసుకోవాల్సిన పద్ధతులకు వివరించారు.

నేరపరిశోధనలో కచ్చితత్వం ఉండాలి

ఫస్ట్‌క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ రమ్య మాట్లాడుతూ జువైనల్‌ను అరెస్టు చేసి జువైనల్ జస్టిస్ బోర్డులో ప్రవేశపెట్టినప్పుడు సివిల్ డ్రెస్‌లో ఉండాలని, వారితో నడుచుకునే విధానాన్ని వివరించారు. జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి.రఘురాం మాట్లాడుతూ చట్టంతో విభేదించిన పిల్లల నేర పరిశోధనలో కచ్చితత్వం పాటించాలన్నారు. జిల్లా ప్రొబేషన్ అధికారి ఎం.శరత్‌బాబు మాట్లాడుతూ జువైనల్ పట్ల పోలీసు అధికారులు ప్రవర్తించాల్సిన విధానాన్ని వివరించారు. విజయనగరం గవర్నమెంట్ జనరల్ హాస్పటల్ సైకాలజిస్టు ఎస్.వి.రమణ మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల పెంపకంలో జాగ్రత్త వహించాని, వారిపట్ల ప్రేమపూర్వకంగా మెలగాలని, వారి కోసం ఎక్కువ సమయాన్ని కేటాయించి స్నేహపూర్వకంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధురాలి హత్య

● ఉలిక్కిపడిన కొండ చాకరాపల్లి గ్రామస్తులు
● పోలీసులు, డాగ్‌స్క్వాడ్ పరిశీలన
● బంగారు ఆభరణాలకోసమని కుటుంబసభ్యుల ఫిర్యాదు



పొలంలో చిన్నమ్మి మృతదేహం (ఇన్‌సెట్లో) గంట చిన్నమ్మి (ఫైల్)



ఘటనా స్థలంలో దర్యాప్తు నిర్వహిస్తున్న పోలీసులు

వంగర: మండల పరిధి కొండచాకరాపల్లి గ్రామానికి చెందిన 62 ఏళ్ల వృద్ధురాలు గంట చిన్నమ్మి బుధవారం హత్యకు గురైంది. వృద్ధురాలి దగ్గర బంగారు ఆభరణాలను దోచుకుని దుండగులు మట్టుబెట్టినట్లు రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్ర వెల్లడించారు. ఆమె కుమార్తె సతిపిడకల పుణ్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు నిర్వహించి ఘటనకు సంబంధించిన వివరాలు తెలిపారు. తన కుమార్తెలు పుణ్యవతి, కళావతిల స్వగ్రామం నీలయ్యవలస వెళ్లిన చిన్నమ్మి అక్కడి నుంచి ఈ నెల 20న కొండచాకరాపల్లి చేరుకుంది. ఆధార్ అప్‌డేట్ చేసేందుకు వలంటీర్‌ను సంప్రదించింది. అదే రోజు సాయంత్రం నుంచి చినమ్మి ఆచూకీ కనిపించలేదు. బుధవారం గ్రామ సమీపంలోని రావి పొలంలో ఆమె మృతదేహం ఉన్నట్లు స్థానికులు గుర్తించి కుటుంబసభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. దీంతో గ్రామస్తులతోపాటు కుటుంబసభ్యులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని చూసి హతురాలి కుమార్తెలు రోదిస్తూ తమ తల్లి వద్ద ఉన్న బంగారు ఆభరణాలకోసం ఎవరో ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు మేరకు రాజాం రూరల్ సీఐ ఉపేంద్రతోపాటు ఎస్సై బుడుమూరు లోకేశ్వరరావులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పంట పొలం సమీప రైతులు, గ్రామంలోని ఆమె ఇంటి పరిసరాల ప్రజలతో మాట్లాడి సమగ్ర దర్యాప్తు చేపట్టిరు. సమాచారంమేరకు విజయనగరం డాగ్‌స్క్వాడ్ వచ్చి తనిఖీలు నిర్వహించింది. వృద్ధురాలిని హత్య చేసిన ఘటనలో నిందితులకోసం అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. మృతదేహాన్ని రాజాం సీహెచ్‌సీకి తరలించి కేసు నమోదుచేశామని వివరించారు.

గ్రామంలో ఆందోళన

ఇదిలా ఉండగా ప్రశాంతంగా ఉన్న పల్లెలో వృద్ధురాలు చిన్నమ్మి హత్యకు గురైన విషయంలో గ్రామస్తులతోపాటు ఆ నోటా ఈ నోటా తెలుసుకున్న పరిసర గ్రామాల ప్రజలు ఉలిక్కిపడ్డారు. ఒంటరిగా పొలాలకు, వెళ్లేందుకు, ప్రయాణాలు చేసేందుకు భయాందోళన చెందుతున్నారు. హతురాలు చిన్నమ్మి గ్రామంలో అందరితో కలివిడిగా ఉండేదని, ఎటువంటి శుభాకార్యాలైన ముందుండి అన్ని పనుల్లో సాయం చేసేదని చెబుతున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురి మృతి

విజయనగరం జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో బుధవారం జరిగిన ప్రమాదాల్లో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. ఆయా ప్రమాద సంఘటనలపై మృతుల కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.



బావిలో పడి మృతి చెందిన సామాలమ్మ

బావిలో పడి మహిళ మృతి

మెంటాడ: మండలంలోని పెదమేడపల్లి గ్రామానికి చెందిన ఆదిరెడ్డి సోమాలమ్మ(43) గ్రామంలోని కారిపొలంలో ఉన్ననేల బావిలో పడి సోమవారం సాయంత్రం మృతి చెందింది. స్థానికులు సమాచారం. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్త గజపతినగరం ఆస్పత్రికి తరలించారు. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారని గ్రామస్తులు తెలిపారు. ఈ విషయమై గజపతినగరం సీఐ లెంక అప్పలనాయుడిని సంప్రదించగా మృతి చెందడం వాస్తవమేనని అయితే బంధువుల నుంచి ఎటువంటి ఫిర్యాదు అందకపోవడం వల్ల ఇంతవరకూ కేసు నమోదు చేయలేదన్నారు.

వేటకు వెళ్లి యువకుడు..

పూసపాటిరేగ: చింతపల్లి పంచాయతీకి చెందిన బెవర మసేను (24) బుధవారం వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. దీనిపై స్థానిక నాయకుడు బర్రి చిన్నప్పన్న అందించిన వివరాలిలా ఉన్నాయి. చేపల వేటకోసం మంగుళూరు జెట్టీకి మసేను బోటులో వెళ్తుడంగా ప్రమాదవశాత్తు సముద్రంలో పడి మృతి చెందాడన్నారు. వల లాగుతుండగా సౌత్ సముద్రంలో పడిపోవడంతో ప్రమాదం జరిగినిట్లు చెప్పారు. పోస్టుమార్టం అనంతరం చింతపల్లిలోని స్వగృహానికి మసేను మృతదేహం చేరుకోవచ్చని తెలిపారు.



సౌత్ సముద్రంలో పడి మృతి చెందిన బెవర మసేను

రైలు నుంచి జారి పడి విద్యార్థి..



మృతదేహాన్ని పరిశీలిస్తున్న జీఆర్‌పీ ఎస్సై శ్రీనివాసరావు

చీపురుపల్లి: పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో రైలు నుంచి జారి పడి కిమిడి శంకరరావు(16) అనే విద్యార్థి మృతి చెందినట్లు జీఆర్‌పీ ఎస్సై చెల్లూరి శ్రీనివాసరావు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం సాయంత్రం పొందూరు నుంచి విశాఖపట్నం రైలులో ప్రయాణిస్తున్న శంకరరావు చీపురుపల్లి సమీపంలో ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి పడి మృతి చెందినట్లు తెలిపారు. వంగర మండలంలోని తలగాం గ్రామానికి చెందిన శంకరరావు విశాఖపట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. స్థానిక రైల్వే స్టేషన్ సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గుర్తించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి..



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

విజయనగరం క్రైమ్: స్థానిక టీటీడీ కల్యాణ మంటపం సమీపంలో ఉన్న ఫుట్‌పాత్‌పై గుర్తు తెలియని 45 ఏళ్ల నుంచి 60 ఏళ్ల మధ్య వయసుకలిగిన వ్యక్తి మృతిచెందినట్లు వన్‌టౌన్ పోలీసులు బుధవారం తెలిపారు. వార్డు ఎంఎస్‌పీ సుధారాణి అందించిన సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి, మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకటరావు తెలిపారు. మృతుని వివరాలు తెలిసిన వారు వన్‌టౌన్ పోలీసులను సంప్రదించాలని కోరారు.